క్లుప్తంగా

70 టన్నుల యూరియా దిగుమతి

శాయంపేట : రైతులకు యూరియా అందుబాటులో ఉంచినట్లు ఏఓ గంగాజమున వెల్లడించారు. మండల కేంద్రంలోని సాయి ఫెర్టిలైజర్స్‌లో 25 టన్నులు, ప్రగతి సింగారం గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 20 టన్నులు, గట్లకానిపర్తి గ్రామంలోని శ్రీవేంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో 5 టన్నుల యూరియా దిగుమతి చేసినట్లు పేర్కొన్నారు. మరో 45 టన్నుల యూరియా దిగుమతి అవ్వాల్సి ఉందని తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని ఈ సందర్భంగా కోరారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి

పరకాల : విద్యారంగ సమస్యలపై మంగళవారం నిర్వహించతలపెట్టిన జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ పిలుపునిచ్చారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ పరకాల మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ తక్షణమే చెల్లించాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి కార్యకర్తలు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ నాయకులు సంజయ్, సందీప్, విజయ్, అజయ్, సుస్మిత, అక్షర పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు సీఐ ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన వక్కల సుమలత (40) ఆగస్టు 30న ఉదయం నారాయణగిరిలోని తన ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఆరా తీసినా కనిపించలేదని తెలిపారు. ఆమె భర్త వక్కల రాజు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ పేర్కొన్నారు. మహిళ ఆచూకీ తెలిస్తే 87126 85010, 87126 85127, 87125 84494 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

సన్మానం



సంతాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సుకినె సంతాజీని సోమవారం తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు కిషన్‌రావు, రవీందర్‌రావు, తిరుపతి, మాదవరావు, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మంచీచెడు చూసేవారు లేరని

● బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న లక్ష్మి

ఎల్కతుర్తి : ఇద్దరు కుమారులు గతంతో మృతిచెందగా ఆ దంపతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారు. అలా కొన్నేళ్లు గడువగా వృద్ధాప్యం వచ్చింది. ఈ వయస్సులో తమ మంచీ, చెడు చూసేందుకు ఎవరూ లేరని మనోవేదనకు గురైన వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. వంగర గ్రామానికి చెందిన దాడి లక్ష్మి(70)కి ఇద్దరు కుమారులు ఉండగా గతంలో పలు కారణాలతో మృతిచెందారు. ఈ క్రమంలో భర్త భూమయ్య, లక్ష్మి ఇద్దరు జీవనం కొనసాగిస్తున్నారు. అయితే ఇద్దరూ వృద్ధాప్యంలోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంచీ, చెడు చూసేందుకు ఎవరూ లేరని చెప్పుకుంటూ లక్ష్మి బాధపడుతుండేది. ఈ క్రమంలో మనోవేదనకు గురైన ఆమె ఆగస్టు 31న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో భర్త భూమయ్య ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదు. మరునాడు ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో లక్ష్మి శవమై కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడకు చేరుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నా రు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు కరువు

● పలుచోట్ల వేలాడుతున్న పరిస్థితి
● ఆటోమెటిక్ సిస్టం లేకపోవడంతో నిత్యం వెలుగులు
● పట్టించుకోని అధికారులు



బస్టాండ్ ఎదుట ఊడిపోయిన హైమాస్ట్ లైట్లు



శాయంపేటలో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న హైమాస్ట్ లైటు

శాయంపేట : మండల కేంద్రంలోని విద్యుత్ స్తంభాలకు బిగించిన విద్యుత్‌దీపాలు వేలాడుతూ నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. టైమర్లు లేకపోవడం, ఆన్, ఆఫ్ చేసేవారు లేకపోవడంతో విద్యుత్ లైట్లు కాలిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి హైమాస్ట్ లైట్లను బిగించారు. అయితే కొన్ని హైమాస్ట్ లైట్లు నాసిరకంగా బిగించడంతో ఊడిపోయి కిందపడినట్లు స్థానికులు చెబుతున్నారు. పెద్దమ్మతల్లి గుడి నుంచి ఎస్సీ కాలనీ వరకు సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైట్లను బిగించగా పోలీస్ స్టేషన్ నుంచి సోషల్ వేల్ఫేర్ గురుకుల పాఠశాల వరకు బిగించిన లైట్లు పలు సమస్యలతో వెలుగుతూ బంద్ అవుతూ ఉన్నాయని స్థానికులు తెలిపారు. అదే విధంగా స్థానిక కూడలి నుంచి ఎస్సీ కాలనీ వరకు గల లైట్లు వెలుగకపోవడంతో ఆ రోడ్డు చీకటిమయంగా మారిందని మండిపడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బస్టాండ్ ఎదుట 6 హైమాస్ట్ లైట్లను బిగించగా అందులో 4 లైట్లు ఊడిపోయాయని, 2 లైట్లు వెలుగడం లేదని, తహసీల్దార్ కార్యాలయం ఎదుట 6 హైమాస్ట్ లైట్లు బిగించగా 2 లైట్లు ఊడిపోగా, ఒకటి సగం వెలుగుతుందని అంటున్నారు. పాత పోస్టాఫీస్ సమీపంలో 6 హైమాస్ లైట్లు బిగించగా 5 లైట్లు ఊడిపోగా, పెద్దమ్మ గుడి ఎదుట ఏర్పాటు చేసిన 6 హైమాస్ట్ లైట్లుకు గాను 2 సగం కాలిపోయి నిరంతరం వెలుగగా 4 లైట్లు పూర్తిగా కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. దీంతో గ్రామంలోని ప్రధాన కూడళ్లు చీకటిమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిచేయని టైమర్లు

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లకు అమర్చిన టైమర్లు పనిచేయకపోవడంతో నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. బీసీ కాలనీ నుంచి ఎస్సీ కాలనీ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంకు ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆన్, ఆఫ్ చేయకపోవడంతో మండలంలోని పలు చోట్ల లైట్లు కాలిపోతున్నాయి.

వీధిలైట్లు వెలగడం లేదు

మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రి సమయంలో భయాందోళన తప్పడం లేదు. సెంట్రల్ లైటింగ్ హైమాస్ట్ లైట్లు కొన్ని ఊడిపోయి. మరికొన్ని కాలిపోయాయి. అధికారులు చర్య తీసుకోవాలి.
- కూతాటి రాజు, శాయంపేట

చర్యలు తీసుకుంటాం

గ్రామంలో లైట్లు వెలుగకుండా, ఊడిపోయిన విషయం మా దృష్టికి వచ్చింది. గ్రామంలో ఏ వీధిలో ఎన్ని వీధిలైట్లు పనిచేయకుండా ఉన్నాయో తెలుపాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం. వెంటనే చర్యలు తీసుకుంటాం.
- సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ధర్మసాగర్ : మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్



ఎల్కతుర్తి : కొత్తపల్లి చెరువును పరిశీలిస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

● సీఐలు ప్రవీణ్‌కుమార్, రమేశ్

ధర్మసాగర్ : మండల పరిధిలోని గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం విగ్రహ నిమజ్జన సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిర్వాహకులు నిమజ్జనం కోసం వాహనాలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఏసీపీ కేటాయించిన ప్రత్యేక నంబర్‌ను వాహనంపై అంటించాలన్నారు. ఒక విగ్రహం ఒక వాహనానికి మాత్రమే అనుమతించబడు తుందని, నిమజ్జనం రోజున డీజే, మ్యూజిక్ సిస్టం నిషేధించినట్లు చెప్పారు. వాహనంలో మద్యం సేవించినవారు ఉండొద్దని, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూసుకోవాలన్నారు. వాహనాన్ని ప్రార్థన స్థలాల సమీపంలో నిలుపొద్దని, ఊరేగింపులో టపాసులు వినియోగించొద్దన్నారు. పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జనాన్ని ప్రశాంతంగా ముగించాలని అన్నారు. ఎస్సైలు షేక్ జానీపాషా, నరసింహారావు, పోలీస్ సిబ్బంది, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

గణపతి నిమజ్జనానికి చెరువుల పరిశీలన

ఎల్కతుర్తి : గణపతి నిమజ్జనంలో అపశృతులు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఐ పులి రమేశ్ అన్నారు. ఎస్సై రాజు, రెవెన్యూ సిబ్బందితో కలసి సోమవారం భీమదేవరపల్లి మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి చెరువును పరిశీలించారు. నిమజ్జనంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు తదితర అంశాలను వివరించారు.

పంగిడిపల్లి రోడ్డును పట్టించుకోవాలి



రాస్తారోకో చేస్తున్న పంగిడిపల్లి గ్రామస్తులు

● గ్రామస్తుల ధర్నా, రాస్తారోకో

కమలాపూర్ : తమ గ్రామానికి రాకపోకలు సాగించే రోడ్డును వెంటనే బాగు చేయాలని మండలంలోని పంగిడిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై స్థానికులు, వాహనదారులు, రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పంగిడిపల్లి గ్రామానికి గతంలో సింగిల్ రోడ్డు ఉండేదని, ఈ మార్గంలో హెచ్‌పీసీఎల్ గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్ నిర్మించిన అనంతరం గ్యాస్ ప్లాంట్‌కు వచ్చిపోయే భారీ వాహనాలతో రోడ్డంతా ధ్వంసమైందని అన్నారు. మోకాలి లోతుతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, వర్షాకాలంలో ఆ గుంతలన్నీ వరదతో నిండిపోయి రోడ్డంతా బురదమయంగా మారుతుందని మండిపడ్డారు. కొన్నేళ్ల క్రితం ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేశారని, దీంతో రోడ్డంతా గుంతలు పడి బురదమయమై రాకపోకలు సాగించలేని, చివరకు కాలి నడకన కూడా ఇబ్బందికరంగా మారిందని అన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు దుస్థితిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదని బుధవారంలోగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేయాలని, లేనిపక్షంలో రోడ్డుపై వంట-వార్పు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ బాబు, ఎస్సై వీరభద్రరావు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి విరమింపజేశారు. ఆందోళనతో హుజూరాబాద్-పరకాల మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మాజీ జెడ్పీటీసీ సాంబరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వీరేశం, శ్రీకాంత్, స్థానికులు, రైతులు, పంగిడిపల్లి వాసులు పాల్గొన్నారు.

మూగజీవాలకు ఇన్సూరెన్స్ కల్పించాలి



గొర్రెల కాపరుల సమస్యలు తెలుసుకుంటున్న సంఘం బాధ్యులు

ధర్మసాగర్ : గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, నట్టల నివారణ మందు పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య, జిల్లా కమిటీ సభ్యుడు దాసరి నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని మల్లక్‌పల్లిలో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి ప్రభుత్వం మూగజీవాలకు మందులు పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధితో పాటు వివిధ ప్రమాదాల్లో వేలాది గొర్రెలు మృత్యువాత పడగా కాపరులు ఆర్థికంగా నష్టపోయారని, రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, 50 ఏళ్లు దాటిన కాపరులకు రూ. 5,000 పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. సొసైటీ అధ్యక్షుడు దాసరి కోటి, మాజీ అధ్యక్షుడు దాసరి చేరాలు, ఉపాధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి రాజు, ఐలయ్య, చినరాజాలు, అనిల్, పాలకట్టమ్మ, వెంకన్న, అరవింద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన జేఏసీ నాయకులు



ఐనవోలు : బీటీరోడ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామాభివృద్ధి, కొండపర్తి రోడ్ల సాధన గ్రామ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. మొదటగా 50 మందితో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిప్రతం అందించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామానికి బీటీ రోడ్లు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తి కాలేదని, రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇటీవల గత కలెక్టర్‌కు, ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని బీటీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు. జేఏసీ నాయకులు సాంబరెడ్డి, చంద్రమౌళి, శ్యాంసుందర్, కిరణ్, మాజీ ఎంపీపీ మోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రణయ్, మాజీ సర్పంచ్ రాజమణి బెన్సన్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాలు గడుస్తున్నా మారని పేదల జీవితాలు

● సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

ధర్మసాగర్ : దశాబ్దాలు గడుస్తున్నా పేదలకు విద్యా, వైద్యం, కూడు, నీడ అందించడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సీపీఐ సమావేశంలో సుమారు 50 కుటుంబాలు పార్టీలో చేరగా జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటరాజుతో కలిసి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదవాడు మరింత పేదవాడుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా ఎదుగుతున్నారని అన్నారు. నూటికి 70 శాతం మంది దుర్భరా జీవితం గడుపుతున్నారని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల జీవన విధానం మారలేదన్నారు. మరోవైపు దేశంలో చదువుకున్న విద్యావంతులకు ఉపాధి అవకాశాలు లేక ఇతర దేశాలకు వలస పోతున్నారని, దేశ అభివృద్ధి కోసం యువకులకు, విద్యావంతులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. వరంగల్ మహా నగరంలో గల హనుమకొండ జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతంగా కొనసాగుతుందని, అయినా ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎదునూరి వెంకటరాజం, నాయకులు బాబు, వెంకటయ్య, రాజు, పద్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



ఎల్కతుర్తి : కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ సోమవారం తెలిపారు. ప్రధాని మోదీ కానుకగా అందించినట్లు చెప్పారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాణి, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం ఆయన నివాస గృహంలో ఆత్మకూరు, దామెర, గీసుకొండ మండలాల సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ నేతల అబద్ధపు హామీలను బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలన్నారు. సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, ప్రస్తుతం ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పోయిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని, అందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గుడేప్పాడ్ గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పలు బాధిత కుటుంబాలను, అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.

నడికూడ : మండలంలోని చౌటుపర్తి గ్రామానికి చెందిన వేల్పుల రమేశ్ కుమార్తె శ్రుతి అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రుతి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముస్త్యాలపల్లి, ధర్మారం గ్రామాలకు చెందిన చింతిరెడ్డి వెంకట్‌రాం రెడ్డి, బందెల కాంతలక్ష్మి, దూలం రమేశ్ ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, వాసు, రాజు, కుమారస్వామి, జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డితో పాటు మరో 94 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీకంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాజేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

‘కాళేశ్వరం’ నీటితో విగ్రహం శుద్ధి



తెలంగాణ తల్లి పాదాలు శుభ్రం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్కతుర్తి : మండలంలోని జీల్గుల గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై కక్ష కట్టి లేనిపోని ఆరోపణలు చేస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోతే మరమ్మతులు చేయాల్సిందిపోయి ఇన్ని రోజులు ప్రాజెక్టులో నీటిని నింపకుండా సముద్రంలో వృథాగా వదిలేసిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిన నిర్ణయంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఆ కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన రహిత మాటలు మానుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, నగేష్, మహేందర్, స్వామి, సమ్మయ్య, కొమురయ్య, దేవేందర్‌రావు, బాబురావు, శ్రీనివాస్, సమ్మిరెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

శాయంపేట : భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ సోమవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారతదేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు చేస్తూ దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ వాఖ్యలు ప్రజాస్వామ్య పరిమితులు దాటి ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి, నాయకులు రాజశేఖర్, నాగరాజు. తిరుపతి, మహేందర్, సుమన్, చంద్రమౌళి, నవీన్, వెంకటేష్, శ్రీనివాస్, సాంబయ్య, జీవన్‌రెడ్డి, విద్యాసాగర్, తిరుపతిరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

కమలాపూర్ : మండల కేంద్రంలోని వినాయక భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఏఎంసీ చైర్ పర్సన్ తొటం ఝాన్సీరాణి, ఎంపీడీఓ బాబు ప్రారంభించి భక్తులను అన్నప్రసాదాలు వడ్డించారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్, భక్త భజన మండలి అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకుడు ప్రసాద్, రాజు, కుమారస్వామి, సులుగూరి హరీష్, రమేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే బలహీన వర్గాలకు న్యాయం



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీతోనే బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ అన్నారు. ఆదివారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేయడమే కాకుండా బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి ఆమోదించడం హర్షణీయమని అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు చేసుకున్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గానికి, స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా బాలరాముడి జయంతి



మాట్లాడుతున్న జలేందర్‌రెడ్డి

శాయంపేట : మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో భగవాన్ బాలరాముడి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, అడ్వొకేట్ లెక్కల జలేందర్‌రెడ్డి బాలరాముడి చిత్రపటానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా భారతీయ కిసాన్ సంఘ్ అనేక గ్రామాల్లో వారం రోజుల పాటు బాలరాముడి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి పాపిరెడ్డి, శాయంపేట రైతు సంఘం ఉపాధ్యక్షులు విజయపాల్‌రెడ్డి, సమ్మిరెడ్డి, నాగరాజు, సదానందం, రంగారెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

పరకాల : ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పాత పెన్షన్ విధానంతో పాటు పెండింగ్ బకాయిలు అందించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానం గుదిబండల మారిందని ఆరోపించారు.